క్లుప్తంగా

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



పోలీసు సిబ్బందికి కరపత్రాలను అందజేస్తున్న పిరమిడ్ మాస్టర్లు

బంగారుపాళెం: క్రమ శిక్షణతో కూడిన జీవన విధానమే సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని పలమనేరు పిరమిడ్ మాస్టర్ బాలాజి అన్నారు. ఆదివారం బంగారుపాళెంలో పలమనేరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, కుప్పాలపల్లె ధ్యాన ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, బాలుర, బాలికల హాస్టల్ విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. శాఖాహార నియమాలు, ధ్యానం ఎలా చేయాలనే కరపత్రాలను పంపిణీ చేశారు. సీఐ నాగరాజరావు, ఎస్ఐ మల్లికార్జున్, పిరమిడ్ మాస్టర్లు నాగరాజు, రోహిణిలక్ష్మి పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని పూతలపట్టు మండలం గొడుగుచింతకు చెందిన శివప్రసాద్ రెడ్డి కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం ఉదయం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు విరాళం అందించారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.

ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యారంగంలో చేసిన సేవలకు నగరంలోని గిరింపేటకు చెందిన ఎన్ఆర్ ప్రసాద్‌కు హైదరాబాద్‌లోని డే స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ నిర్వాహకులు ఆదివారం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ, 40 ఏళ్లుగా విద్యాసేవలందిస్తున్న తనకు డాక్టరేట్ లభించడం ఆనందంగా ఉందన్నారు. ఇది మరింత బాధ్యత పెంచిందని, నిరుపేదలకు, అట్టడుగు వర్గాలకు మరిన్ని విద్యాసేవలందిస్తానన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ

తవణంపల్లె: గ్రామీణులు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి ఎగువ మత్యంలోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ పల్లెల్లో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని వాటికి మోసపోకుండా జాగ్రత్తగా మెలగాలని సూచించారు. ఎన్నికల దృష్ట్యా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఏఎస్ఐ రాజేంద్ర పాల్గొన్నారు.

15న సేవాలాల్ మహారాజ్ జయంతి

పుంగనూరు: సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు బంజార సంఘ ప్రతినిధి డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్ తెలిపారు. ఆదివారం సంఘ నాయకులు నాగేనాయక్, ఆంజినాయక్, శ్రీనివాసులుతో కలసి జయంతి వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఏడు తాండాలలోని బంజారాలతో కలసి ఈ జయంతి వేడుకలు పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని ఐకమత్యాన్ని చాటాలని కోరారు.

సింగిల్‌విండోలో ఈకేవైసీ చేసుకోండి

రామకుప్పం: స్థానిక సింగిల్‌విండో సొసైటీలో రుణాలు తీసుకున్నవారు, డిపాజిట్‌దారులతో సహా సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని బ్యాంకు అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, సీఈఓ సుబ్రమణ్యం ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, వన్‌-బీ అడంగల్ నకళ్లను స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో సమర్పించాలన్నారు. సోమవారం లోపు సభ్యులందరూ అవసరమైన పత్రాలను అందజేయాలని కోరారు.

ముందు 'చూపు'న్న ప్రభుత్వం



యాదమరిలో గ్రామీణ ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు..

చూపులేక పోతే బతుకంతా చీకటే... చూపు కొంత మందగించినా జీవనం కష్టమే. దీనిపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన ప్రాధాన్యతాంశాల్లో కంటి చూపు పరిరక్షణకు చోటిచ్చారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంతో చిన్నారుల నుంచి పండుటాకుల వరకూ అందరిలో దృష్టి లోపాలు సవరించి అవసరమైన వారికి శస్త్రచికిత్స ఉచితంగా చేయిస్తున్నారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలో పలువురికీ మంచి చూపును ప్రసాదించింది.

- 'వైఎస్సార్ కంటి వెలుగు'తో కొత్త జీవితం
- ఆరు దశల్లో ఇప్పటికే మూడు విడతలు పూర్తి
- 12,641 మందికి కంటి పరీక్షలు చేసిన వైద్యులు
- 1,991 మందికి కళ్లద్దాల పంపిణీ
- 832 మందికి కంటి ఆపరేషన్లు

యాదమరి: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నియోజక వర్గంలో వేలాదిమందికి కంటిచూపు ప్రసాదించింది. ఆరు దశల్లో అమలు చేసే కార్యక్రమం ప్రస్తుతం మూడో దశ పూర్తి చేసుకుంది. మొదటి రెండు దశల్లో ప్రభుత్వం ప్రైవేటు పాఠశాల చిన్నారులకు కంటి వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్స చేయడంతోపాటు దృష్టి లోపాలు ఉన్నవారిని గుర్తించి వారికి కళ్లద్దాలు అందజేసింది. మూడు నుంచి ఆరో దశ వరకు వృద్ధులతో పాటు అవసరమైన వారందరికీ ఉచిత కంటి పరీక్షలు కళ్లద్దాలు అందజేయడంతోపాటు శస్త్ర చికిత్స చేయనున్నారు. నియోజక వర్గంలోని పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో 12,614 మందికి కంటి పరరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించి ఆ దిశగా గ్రామాలలో కంటి వైద్య పరీక్షలు చేయించింది. 1,991 మందికి కళ్లద్దాలను ఉచితంగా అందజేసింది. 832 మందికి శస్త్ర చికిత్స చేయడానికి కంటి వైద్య నిపుణులు రెఫర్ చేశారు. అలాగే ఐదు మండలాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 646 మందికి కళ్లద్దాలు అందజేశారు.



వృద్ధులకు ఉచితంగా కళ్లద్దాలను ఇస్తున్న యాదమరి ఎంపీపీ సురేష్‌బాబు

ఇప్పుడు బాగా కనిపిస్తాంది



కొన్నాళ్లుగా కళ్లు సరిగా కనపడలా. ఈమధ్యన మా ఊర్లోనే డాక్టర్లు చాలామందికి కళ్ల పరీక్ష చేసినారు. నేను కూడా చూపించుకున్నా. నాకు మందులు, కంటెద్దాలు ఇచ్చినారు. ఇప్పుడు అవి వాడతాంటే చూపు బాగా కనిపిస్తాంది.

-సుందరమ్మ, నెల్లిమంద, ఐరాల మండలం

చుక్కల మందుతో బాగు



మా స్కూలుకు డాక్టర్లు వచ్చారు. అందరికీ ఫ్రీగా కళ్లపరీక్షలు చేశారు. నాకు కంట్లో నీళ్లు కారుతున్నట్టు చెప్పాను. చుక్కల మందు ఇచ్చారు. అది వాడినాక నీళ్లు కారేది నిలిచిపోయింది. మా స్కూల్‌లో అన్ని సౌకర్యాలు కల్పించిన జగన్ మావయ్యకు చాలా థ్యాంక్స్

-కవిత, ఆరవ తరగతి, కె.గొల్లపల్లె, యాదమరి

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయడం వల్ల కొందరిలో దృష్టిలోపాలతో బాధపడుతున్నట్టు గుర్తించాం. ఆ లోపాల నివారణకు చికిత్స చేశారు. మందులుచ కళ్లద్దాలూ ఇచ్చారు.

-రుక్మిణి, ఎంఈఓ, యాదమరి

గాండ్ల కులస్తుల కల సాకారం



గాండ్ల కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయింపు
- చంద్రబాబు పాలనలోనూ మొండిచెయ్యే!
- వైఎస్సార్ సీపీ పాలనలో ఆవిష్కృతం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో సామాజిక వర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా గాండ్ల కులస్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. మున్సిపాలిటీకి సమీపంలోని గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 88లోని 3.45 ఎకరాల విస్తీర్ణంలో 2.08 ఎకరాలను గాండ్ల కులస్తుల కమ్యూనిటీ హాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత నెల కుప్పం పర్యటనలో గాండ్ల కులస్తుల వినతిపై స్పందించి ఈ స్థలం మంజూరు చేయించారు.

గాండ్ల సామాజిక వర్గం హర్షం

నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంలో గాండ్ల కులస్తులకు స్థలం కేటాయింపుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గాండ్ల కులస్తులు పెద్ద హోదాల్లో, పదవులు అనుభవించినా కులస్తులకు చేసింది శూన్యం. ఇప్పటి వరకు ఇదే సామాజిక వర్గానికి చెందిన నలుగురు కుప్పం ఎమ్మెల్యేలుగా పనిచేశారు. అనంతరం చంద్రబాబు సీఎంగా అధికారంలో ఎమ్మెల్సీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, టీడీపీ పార్టీ అధ్యక్షులుగా గాండ్ల కులస్తులు ఉన్నారు. 35 ఏళ్లుగా చంద్రబాబుకు వ్యక్తిగత క్యాదర్శిగా పనిచేస్తున్న వ్యక్తి కూడా గాండ్ల కులస్తుడే. కానీ ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలనే గాండ్ల కులస్తుల కలను ఎవరూ సాకారం చేయలేకపోయారు.

వైఎస్సార్ సీపీ పాలనలో నెరవేరింది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో గాండ్ల కులస్తుల కల సాకారమైంది. గాండ్ల కులస్తుల వినతి మేరకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేకంగా ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకొచ్చారు. త్వరలో స్థలాన్ని చదును చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

ఐరాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. చిగరపల్లెలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నేత గణేష్ ప్రసాద్‌రెడ్డిని ఆదివారం సమన్వయకర్త కలిశారు. సోమవారం నుంచి మండలంలో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారం గురించి చర్చించినట్లు పార్టీ అధ్యక్షుడు తెలిపారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: తమ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: తమ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరాముడు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, మండల ప్రజల సమస్యలపై అర్జీల రూపంలో తహసీల్దార్‌కు అందజేయాలని తెలిపారు. మండల ప్రజలు స్పందనను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

నేడు నాగదేవతల ప్రతిష్ఠ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం నాగదేవతలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. స్వామివారి ప్రధాన ఆలయంలోని అద్దాల మండపం వెనుక భాగంలో సోమవారం వేకువజామున 4 గంటల నుంచి 5 గంటలలోపు నాగదేవతలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు హాజరై దర్శించుకోవాలని కోరారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

తవణంపల్లె: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి తెలిపారు. చెర్లోపల్లెలో జాతీయ సేవా పథకం ప్రత్యేక క్యాంపులో భాగంగా ఆదివారం ఆరోగ్య సమస్యలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

బధిర సంఘ భవనానికి స్థలం ప్లీజ్!

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా బధిర సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని బధిరుల సంఘం జిల్లా అధ్యక్షులు ధనంజయ్ కోరారు. ఆ సంఘం 35 వార్షికోత్సవం ఆదివారం నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బధిరుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో భర్తీ చేసే పోస్టులలో బధిరులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి విక్రమ్ మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆ కార్పొరేషన్ పరిధిలో రుణాలు మంజూరు చేసి 100 శాతం సబ్సిడీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బధిరుల భాష అనువాదకుడు రాజు, సంఘ నాయకులు మురళి, చంద్రశేఖర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉబ్బ దేవర్లు



వీరభద్రస్వామికి మొక్కుతున్న రజక వృత్తిదారులు

పెద్దపంజాణి: రజక కులస్తులు ప్రతి ఏటా నిర్వహించే ఉబ్బ దేవర్లను ఆదివారం రాయలపేటలో ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాపన్న, హేమచంద్ర, చంగప్ప, పెద్దరెడ్డెప్ప, చిన్నరెడ్డెప్ప, శీనా, మునిరాజ, చెంగల్వ, నాగరాజ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు



విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో డివిజన్ పరిధిలోని హాస్టళ్ల టెన్త్ విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఆదివారం నిర్వహించారు. గంగవరం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సోమచంద్రారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే కష్టసాధ్యమైనదీ ఏదీ లేదన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలన్నారు. కార్యక్రమంలో పలువురు హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆదివారం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ మైనార్టీస్ (సీఈడీఎం) సౌజన్యంతో అంజుమాన్ తరిక్ ఉర్దూ కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్‌-2 శిక్షణ పొందుతున్న పలువురు మైనారిటీలకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతులమీదుగా వీటిని ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పోలీసుల 'పల్లెనిద్ర'

- ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే కేసులు: సీఐ
- 71మంది రౌడీషీటర్ల బైండోవర్



శ్రీనాథపురం కాలనీ గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఎన్నికలలో గొడవలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని కల్లూరు సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం రాత్రి మండలంలోని శ్రీనాథపురం కాలనీలో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సీఐ మాట్లాడారు. గొడవలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. వీటికి పాల్పడితే కేసులతో నష్టపోతారనేది గుర్తెరగాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు ఓట్లు వేసేలా బందోబస్తు కల్పిస్తామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 71 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లు ఎన్నికలలో గొడవలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం శ్రీనాథపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

దీనదయాళ్ సేవలు చిరస్మరణీయం



దీనదయాళ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

గుడిపాల: బడుగు, బలహీన వర్గాల వారి అభున్నతికి దీనదయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అన్నారు.గుడిపాలలో ఆదివారం దీనదయాళ్ వర్ధంతిని 197రామాపురంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసంఘ్ అధ్యక్షుడిగా ఆయన పేదల సంక్షేమానికి ఎంతో కృషిచేశారని స్మరించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కో-కన్వీనర్ దేవరాజ్, నాయకులు శేఖర్, శరవణ, సుధీర్‌కుమార్, సురేష్, సునీల పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- ఇంటింటా ఎన్నికల ప్రచారంలో దుర్గ



మహిళలకు సారె అందజేస్తున్న దుర్గ

రామకుప్పం: కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లె, విజలాపురం, రామకుప్పం పంచాయతీలలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పార్టీలు, కులమతాలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుప్ప నియోజకవర్గం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి పనులను ఆమె వివరించారు. అలాగే మహిళలకు మహిళలకు సారె అందజేసి, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని, కుప్పంలో పార్టీ జెండా విజయకేతనం ఎగురవేసేలా చూడాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచులు మురళీకృష్ణ, రాజ్‌గోపాల్, కుప్పం ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, వార్డు సభ్యులు అబ్దుల్,గోపీకృష్ణ, జమీను ప్రసాద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, నేతలు తజ్‌ముల్ పాషా, సిద్ధప్ప, నయాజ్, నారాయణ స్వామి, శంకర్, వెంకటాచలపతి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యానికి భద్రత



ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు: ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ డిపోలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కరీముల్లా, గౌరిశంకర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోలాహలం.. నిమజ్జనం



భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాటగంగమ్మ జాతరను శనివారం రాత్రి వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారి శిరస్సును ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి శిరస్సును నిమజ్జనానికి తరలించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ నివాసం వద్ద అన్నదానం చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, పెద్దిరెడ్డి అభినవ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.